పారిశుద్ధ్యం పెంపునకు ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే పార్థసారథి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పోరంకిలో శుక్రవారం రూ.1.26 కోట్లతో కొనుగోలు చేసిన చెత్త తరలించే మూడు వాహనాలు (కాంపాక్టర్స్)ను ప్రారంభించి ప్రసంగించారు. తాడిగడప మున్సిపాలిటీలో యనమలకుదురు, తాడిగడప, కానూరు, పోరంకి గ్రామాలను విలీనం చేశామన్నారు. ఈ ప్రాంతంతో నివాసాలు ఎక్కువగా ఉన్నాయని, రోజూ టన్నుల కొద్దీ చెత్త వస్తోందన్నారు. చెత్త తరలింపు సమస్యగా మారటంతో ఆధునిక పద్ధతిలో చర్యలు చేపట్టామని వివరించారు. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా చెత్త సేకరించి తరలించడం కోసం కొత్తగా వాహనాలు కొనుగోలు చేశామన్నారు. 127 డంపర్ బిన్లను రూ.49 లక్షలతో కొనుగోలు చేశామన్నారు. గ్రామాల్లో చెత్తను డంపర్ బిన్లలో వేయాలని సూచించారు. దీంతో డంపర్ బిన్ల నుంచి సులువుగా చెత్త సేకరించి తరలించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తతో స్థానికంగా ఇబ్బందులు కలగకుండా ఉండటానికి గుంటూరు పవర్ ప్రాజెక్ట్‌కు తరలిస్తున్నారని తెలిపారు. తాడిగడప మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్య లేకుండా ప్రజలు అధికారులకు సహకరించాలని


చెత్త తరలించే నూతన వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

కోరారు. కార్యక్రమంలో తాడిగడప కమిషనర్ ఎన్.ప్రకాశరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, నేతలు అన్నే శ్రావణ్‌కుమార్, చాంద్‌బాషా, ఆకునూరు మాణిక్యం, వేమూరి బాలకృష్ణ, అంకెం రాజేష్, వీర్ల బుజ్జి, లతీఫ్, ఖాదర్ బాషా, అంగిరేకుల సీతారామయ్య, మేడసాని రమేష్‌బాబు, క్రిస్టోఫర్, రచ్చా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్మికులకు అండగా ప్రభుత్వం

మున్సిపాలిటీలోని కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎన్.ప్రకాశరావు అన్నారు. పోరంకిలో శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనె, పాదరక్షణ ఇతర సామగ్రి పంపిణీ చేశారు. రాష్ట్రంలో కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడినప్పుడు ఇక్కడ పని చేస్తున్న కార్మికులను.. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో ప్రభుత్వం గుర్తించి విలీనం చేసిందన్నారు. దీంతో ట్రెజరీ ద్వారా సకాలంలో జీతాలు అందుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం కార్మికులకు అలవెన్స్‌తో పాటు రూ.21 వేలు ఇస్తుందన్నారు. కార్మికులు మృతి చెందితే మట్టి ఖర్చుల కింద రూ.15 వేలు ఇస్తున్నామని వివరించారు. సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఇప్పటివరకు మరణించిన 13 మంది కార్మిక కుటుంబాలకు పరిహారం కింద


దుస్తులు పంపిణీ చేస్తున్న కమిషనర్ ప్రకాశరావు, టిడ్కో డైరెక్టర్ రాఘవరావు

సొమ్ము ప్రభుత్వం ఇచ్చిందన్నారు. నేడు కార్మికులకు రూ.32 లక్షలతో వివిధ రకాల సామగ్రి, పని ముట్లు అందచేశామని తెలిపారు. సీఎం జగన్ పాలనలో మున్సిపల్ కార్మికులకు పూర్తి న్యాయం జరుగుతుందని వివరించారు. టిడ్కో డైరెక్టర్ రాఘవరావు మాట్లాడుతూ జగనన్న అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో కార్మిక, కర్షక, సామాన్య ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ మాణిక్యం, మున్సిపాలిటీ పార్టీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్, నేతలు అంకెం రాజేష్, అంగిరేకుల సీతారామయ్య, రచ్చా వెంకటేశ్వరరావు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు చినకంచిలో ఉత్తరద్వార దర్శనం

నున్న(విజయవాడరూరల్): ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం చినకంచిలోని శ్రీ అష్టలక్ష్మీ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 5 గంటలకు ఉత్తరద్వార దర్శనం, 8గంటలకు లక్ష తులసీ పూజ, 9 గంటలకు ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభవుతాయని దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ ఆదివారం రాత్రి 7గంటలకు శ్రీస్వామినాథస్వామి వారి కల్యాణోత్సవం, 25వ తేదీ ఉదయం వసంతోత్సవం, పూర్ణాహూతి, అభిషేకార్చనలు అనంతరం అన్నదానం జరుగుతుందన్నారు.

2 నుంచి రూరల్‌లో రెండో విడత 'సురక్ష'

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 2వ తేదీ నుంచి విజయవాడ రూరల్ మండలంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు జరుగుతాయని ఎంపీడీఓ బి.భార్గవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారానికి రెండు గ్రామాల్లో మాత్రమే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు జరుగుతాయని మండలంలోని ప్రజలు తమ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పెద్ద జబ్బులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల వరకు వైద్యసేవలను అందిస్తుందని పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన రోగులకు ప్రభుత్వం కొంత ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు.

26 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

విజయవాడరూరల్: మండలంలో ఈ నెల 26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు జరుగుతాయని ఎంపీడీఓ బి.భార్గవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 4, 500 మంది క్రీడాకారులు పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో గొల్లపూడి ఎస్‌పీఎస్ఆర్‌సీ హైస్కూల్, నున్న, రామవరప్పాడు, నిడమానూరు గ్రామాల్లోని జెడ్పీ హైస్కూళ్లలో క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు.

పరిశ్రమల అభివృద్ధికి కృషి




పెనమలూరు: పరిశ్రమల అభివృద్ధికి జేఆర్డీ టాటా ఎస్టేట్(ఐలా) కృషి చేస్తోందని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్ అన్నారు. కానూరు జేఆర్డీ టాటా ఎస్టేట్‌లో శుక్రవారం 17వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిశ్రమలు సుస్థిరంగా ఉంటేనే ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. ఇందుకు జేఆర్డీ టాటా ఎస్టేట్ కృషి చేస్తోందని తెలిపారు. తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ మాట్లాడుతూ గుంటతిప్ప డ్రైన్‌ను ఆధునికీకరిస్తామన్నారు. జేఆర్డీ టాటా ఎస్టేట్‌లో వసూళ్లు చేసిన పన్నుల్లో 35 శాతం పన్నుల వాటాగా రూ.13.5 లక్షల చెక్కు తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ప్రకాశరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐఐసీ జెడ్ఎం కేఎస్ఎస్ సీతారామ్, జేఏఆర్డీ టాటా ఐలా కమిషనర్ ఎం.మధు, ఐలా చైర్మన్ టి.వినోద్‌బాబు, కార్యదర్శి టి.శ్రీనివాసరావు, కన్వీనర్ సునీల్‌కుమార్‌గుప్తా, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు



కంకిపాడు: ఉప్పలూరు పీహెచ్‌సీలో సెమీక్రిస్మస్ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సంతోష చంద్రిక ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ జరిగింది. పాస్టర్ జాన్‌పాల్ రెడ్డి దైవ ప్రార్థనలు చేశారు. క్రీస్తు బోధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సాయి నిఖిత, డాక్టర్ అంజు, ఎంపీహెచ్ఈఓలు కృష్ణారావు, శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ పద్మావతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పీవీ రావు ఆశయ సాధనకు కృషి



కంకిపాడు: పీవీరావు ఆశయ సాధనకు కృషి చేయాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు పిలుపునిచ్చారు. మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు 18వ వర్ధంతిని శుక్రవారం కంకిపాడులోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. పీవీ రావు చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొవ్వా సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శి శ్రీనివాస్ గాంధీ, గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంథోని, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పెనమలూరు: గోసాలలో పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు ఎస్ఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం గోసాల వైకుంఠపురంలో పేకాడుతున్నారనే సమాచారంతో దాడి చేయగా ఐదుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 6,300 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

వేధింపుల కేసు నమోదు

పెనమలూరు: వివాహితతో అసభ్యంగా ప్రవర్తించి ఆమెను వేధించిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప రామానగర్ కాలువ కట్టపై వట్టిప్రోలు సుభద్ర, భర్త నాగార్జున, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. భర్త ఆటోనగర్ స్టీల్ కంపెనీలో పని చేస్తున్నారు. సుభద్ర కేబుల్ ఆఫీసులో పని చేస్తున్నారు. గతంలో పరిచయమున్న షేక్ బాబులు ఆమె వెంటపడి ఇబ్బంది పెడుతుండటంతో పెద్దల సమక్షంలో మందలించారు. అతను గురువారం సుభద్ర ఇంటికి మద్యం సేవించి వచ్చి అసభ్యకరంగా ప్రవర్తించి బెదిరించాడు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గణితంపై పట్టు సాధించాలి

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

పెనమలూరు: విద్యార్థులు గణితంపై పట్టు సాధించాలని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ గణితశాస్త్రం ప్రొఫెసర్ డాక్టర్ రామినేని చూడామణి అన్నారు. డాక్టర్ శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ గణిత దినోత్సవం కానూరు సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. చూడామణి మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై భయాన్ని జయించాలన్నారు. మెలకువలు తెలుసుకుంటే గణితం సులువుగా అర్థమవుతుందన్నారు. పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ మాట్లాడుతూ రామానుజన్ కనుగొన్న సూత్రాలు చాల అపూర్వమైనవన్నారు. విద్యార్థులు 100 అంశాలపై మ్యాథ్స్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, గణిత విభాగాధిపతి సింహాచలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, మానవత సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.


కానూరులో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు

ఈ సందర్భంగా బాపులపాడు మాజీ సర్పంచ్ మేడేపూడి సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన మనుమరాలు వీరమాచినేని శమంతకమణి రూ.5 వేల విరాళాన్ని మానవత సంస్థకు అందించారు. జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

వీరవల్లిలో..

వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు గణితశాస్త్ర ప్రాధాన్యం, గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలను ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల వివరించారు. అనంతరం శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు గణిత ప్రాథమిక పరిజ్ఞానం, గణిత పాఠ్యాంశాలపై వకృత్వం, వ్యాస రచన, క్విజ్, పాటల పోటీలు నిర్వహించారు. గణిత భావనలను వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన చార్టులు, నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్రామానికి విశ్రాంత ఇంజినీర్ నందమూరి సీతారామయ్య ఆర్థికసాయంతో గణిత పోటీల్లో విజేతలుగా బహుమతులు అందించారు. పాఠశాల స్టాఫ్ కార్యదర్శి మానికొండ రమణగోపాల్, గణిత ఉపాధ్యాయులు ఆళ్ల కృష్ణారావు, ఎల్ కోటేశ్వరరావు, ఎస్.ఆశాలత పర్యవేక్షించారు.


రామానుజన్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: ఇందుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం తిమ్మరాజు సీతారామన్ గణితంలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణిత ప్రాముఖ్యాన్ని వివరించారు. అనంతరం రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాలల్లో గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పాలన

రామవరప్పాడు: రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని జెడ్పీటీసీ సువర్ణరాజు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు సచివాలయం-2లో శుక్రవారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ బోర్డు క్యాలెండరు, వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను నేతలు ఆవిష్కరించారు. సువర్ణరాజు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం గాలికొదిలేసిన విద్య, వైద్య రంగాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని తెలిపారు. నాడు- నేడు, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. ఆరోగ్యశ్రీ కార్డును రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించారన్నారు. పార్టీ మండల కన్వీనర్ శీలం రంగారావు మాట్లాడుతూ రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మనందరం కలిసి గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, మండల సచివాలయాల కన్వీనర్ సాదం వెంకటేశ్వరరావు, ఈవోఆర్డీ శేషగిరిరావు, ఇన్‌చార్జి కార్యదర్శి రాజేంద్రప్రసాద్, పట్టపు రాజా, వార్డు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కేసరపల్లి(గన్నవరం): స్థానిక గ్రామ సచివాలయం-1లో శుక్రవారం వై నీడ్స్ ఏపీ జగన్, పల్లెకు పోదాం కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అధ్యక్షతన సంక్షేమ పథకాల బోర్డును జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజిబెత్‌రాణి, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి ఆవిష్కరించారు.

అనంతరం ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా


సంక్షేమ బోర్డు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



వేదికపై వైస్ ఎంపీపీ, సర్పంచి, జెడ్పీటీసీ తదితరులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో అర్హులకు అన్యాయం చేసిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందజేస్తోందన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో సచివాలయం-1 పరిధిలోని ప్రజలకు రూ. 66.05 కోట్లు ప్రభుత్వం లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ప్రజలకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు.

ఈఓపీఆర్డీ పి. వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి మౌనిక, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ సచివాలయ కన్వీనర్లు కొలుసు వెంగళరావు, జంపన బుజ్జి, షేక్ దస్తగిరి, పలువురు పార్టీ నేతలు ఆవిష్కరించారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

రామవరప్పాడు: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తవుతాయని నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. రూరల్ మండలం నిడమానూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన 'మాదక ద్రవ్యాలు- సోషల్ మీడియా దుర్వినియోగంపై' అవగాహన సదస్సు నిర్వహించారు. శేఖర్‌బాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల వినియోగాన్ని నివారించాలన్నారు. ప్రస్తుతం అవగాహన లోపంతో విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారన్నారు. నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ సరదాగా మొదలైన అలవాటు బానిసగా మారుస్తుందన్నారు. ఈ వ్యవసనాల ప్రభావంతో తమ వ్యక్తిత్వం కోల్పోవడంతో పాటు సమాజంలో చులకనకు గురవుతారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని


మాట్లాడుతున్న గోళ్లమూడి శేఖర్ బాబు

సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటైన వారిని డి ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రకాష్‌నాథ్, నవజీవన్ జోనల్ కోఆర్డినేటర్ డి.విజయరాణి, మహిళా సంరక్షణ కార్యదర్శులు రజిత, ముబీనా బేగం, లలిత, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగో విడత వైఎస్సార్ ఆసరా రూ.19.13 కోట్లు

నున్న(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకంలో రూ.19.13 కోట్ల రుణమాఫీ చేయనుందని వైఎస్సార్ క్రాంతి పథం అసిస్టెంటు ప్రాజెక్టు మేనేజర్ జి.చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం డ్వాక్రా గ్రూపు మహిళల వేలిముద్రల వెరిఫికేషన్‌కు వచ్చిన ఆయన డ్వాక్రా గ్రూపు మహిళలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతలుగా మండలంలోని డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ.57, 40,89,525 వైఎస్సార్ ఆసరా పథకంలో అందజేసిందన్నారు.

దీంతో రెండువేల రెండు గ్రూపులకు చెందిన 19,809 మందికి రుణమాఫీ జరిగిందన్నారు. ఈ విషయాన్ని గ్రూపుల్లోని సభ్యులకు తెలియజేయాలన్నారు. అందుకోసం బ్యాంకుల్లో ప్రతి సభ్యురాలి వేలిముద్రల నమోదు తప్పకుండా వేయాలన్నారు. సమావేశంలో సీసీ కొండలరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

దావాజిగూడెం(గన్నవరం): స్థానిక శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం కుంకుమార్చనలు చేశారు. తెల్లవారు జామున ఆలయ అర్చకులు ఎన్. రామాచార్యులు నేతృత్వంలో శ్రీగోదాదేవి, శ్రీకృష్ణస్వామివార్లకు సుప్రభాతసేవ, విశేష అర్చనలు, తిరుప్పావై ప్రబంధ పారాయణం జరిగింది. అనంతరం శ్రీగోదాదేవి సన్నిధిలో భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు.


సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

రహస్యాలు తెలుసుకోవడమే సైన్స్

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రకృతి, జీవరాశులు, విశ్వంలో దాగి ఉన్న రహస్యాలను తెలుసుకోవడమే సైన్స్ అని ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్ అన్నారు. నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన చెకుముకి సైన్స్ సంబరాలు పేరిట మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన జట్లు ఉత్సాహంగా హాజరయ్యారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని ఎంఈవో బాలాసింగ్ అన్నారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతగా వేలేరు జెడ్పీ హైస్కూల్, వాణి విద్యానికేతన్ జట్లు నిల్చాయి. ఆరుగొలను జెడ్పీ హైస్కూల్, సాయి గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్, ఎంఈవో-2 బి.సురేష్ కుమార్ విద్యార్థులకు ప్రశంసా



చెకుముకి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పత్రాలను అందజేశారు. జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్ష, కార్యదర్శులు వీడీఎస్ ప్రసాద్, దారపురెడ్డి భాస్కరరావు పోటీలను పర్యవేక్షించారు. బాపులపాడు, వేలేరు జెడ్పీ హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు, కొమ్మా విజయ్, సైన్స్ ఉపాధ్యాయులు స్టాలిన్, మల్లేశ్వరరావు, ఆర్.వి.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మను ఆరాధించండి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మార్గశిర మాసంలో గురువారం పూట దుర్గమ్మను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే లక్ష్మీ కటాక్షం కలుగుతుందని యనమండ్ర ఉమాకాంత్ శర్మ అన్నారు. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళా వేదికపై శుక్రవారం మార్గశిర మాసం విశిష్టతపై ధార్మిక ప్రవచనం జరిగింది. మహాలక్ష్మి అమ్మవారికి మార్గశిర మాసం ఎంతో ప్రీతిపాత్రమైనదని, మహాలక్ష్మీ స్వరూపమైన దుర్గమ్మను గురువారం నాడు ఆరాధిస్తే సకల శుభాలు కలుగుతాయని, లక్ష్మీ కటాక్షం కలిగి అన్ని సౌభాగ్యాలు సిద్ధిస్తాయన్నారు. అమ్మవారి ఆజ్ఞలు అనుసరిస్తూ జీవించాలని కోరారు.

మినరల్ మిక్సర్ ప్యాకెట్ల పంపిణీ

పొలవరం(పామర్రు): డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పశువులకు అవసరమైన మినరల్ మిక్సర్‌ను శుక్రవారం ఉచితంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఇమ్రి సీహెచ్ఎస్ ఆపరేషన్స్ స్టాఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ తుషార్, జిల్లా మేనేజర్ పోట్నూరు నరేష్, ఏపీ-1962 వాహనంలో పని చేస్తున్న పశు వైద్యులు బి.వెన్నెల, జి.సుకన్య, కె.సోనియాదేవి, ఎం. గోపినాథ్, సిబ్బంది కలిసి పాడి పశువులు ఉన్న రైతులకు ఈ పోషకాలను అందించారు. రైతులు, పశుసోషకులు పాల్గొన్నారు.

ప్రకటన

చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్
ది.22-12-2023
సెల్: 9440784148

ఘనంగా తేరు ఊరేగింపు ఉత్సవం

గన్నవరం: గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న తేరు ఊరేగింపు శుక్రవారం గన్నవరం చేరుకుంది. స్థానిక కొత్తపేట వద్ద గుణదల మాత తేరు స్వరూపానికి ఆర్‌సీఎం విచారణకర్త ఫాదర్ పసల థామస్ నేతృత్వంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం మేళాతాళాలు మధ్య జాతీయ రహదారిపై ఊరేగింపు కొనసాగింది. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద సీఐ పి. కనకరావు గుణదలమాత తేరుకు పూలమాలలు వేశారు. అనంతరం స్థానిక బాలయేసు దేవాలయానికి తేరు ఊరేగింపు చేరుకుంది. ఈ సందర్భంగా ఫాదర్ పసల థామస్ ఆధ్వర్యంలో జపమాల, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గన్నవరం విచారణ పరిధిలోని నాగవరప్పాడు, దావాజిగూడెం, అల్లాపురం, వీఎస్ పురం కాలనీలో వందలాది మంది భక్తులతో తేరు ఊరేగింపు జరిగింది. సాయంత్రం తిరిగి బాలయేసు దేవాలయానికి


మేరిమాత తేరుకు స్వాగతం పలుకుతున్న ఫాదర్ థామస్, విశ్వాసులు

తేరు చేరుకోగా దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన క్రిస్మస్ గీతాలు, కేరల్స్ బాలబాలికలతో నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. ప్యారిస్ కౌన్సిల్ అధ్యక్షుడు నీలం జాకబ్, సభ్యులు, మరియదళం, విన్సెంట్ ది పాల్ సొసైటీ సభ్యులు, సెయింట్ పీటర్ క్లావర్ సిస్టర్స్, ఉపదేశులు పాల్గొన్నారు.

● చర్చిలకు క్రిస్మస్ శోభ



నున్న(విజయవాడరూరల్): క్రిస్మస్ పండుగ సమీపించడంతో గ్రామాల్లోని చర్చిలు విద్యుత్ దీపాల అలంకరణలతో కళకళలాడుతున్నాయి. చర్చిల వద్ద పశువుల పాకలు, క్రిస్మస్ ట్రీలను ముస్తాబు చేశారు. ఆదివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున, మధ్యాహ్నం కూడా క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. నున్నలో ఫెయిత్ టెంపుల్ చర్చి, సీఎస్ఐ చర్చి, ఆర్‌సీఎం చర్చి మరి కొన్ని చర్చిలతో పాటు పాతపాడు, బోడపాడు, పి.నైనవరం, విలేజి కండ్రిక, అంబాపురం గ్రామాల్లోని చర్చిలు పండుగ శోభను సంతరించుకున్నాయి.